క్లుప్తంగా

ఓటుతో సుపరిపాలన

క్రోసూరు: ఓటు వేయటం ద్వారా మాత్రమే దేశానికి మంచి పాలకులను ఎంచుకోవచ్చునని మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని గురువారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో ఓటరు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో బి.మహేష్‌బాబు, కాలేజీ ప్రిన్స్‌పాల్ బీవీ రమాదేవీ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు తో సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, బీఎల్‌వోలు, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొని మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



అచ్చంపేట: మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన 15 టీడీపీ ఎస్సీ కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి చేరిన వారికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి పనులు వేల కోట్లలో జరుగుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో నందిగం భూషణం, దర్శి ఇస్సాకు, దర్శి స్వామి, దర్శి మనీషా, నందిగం విష్ణు, దర్శి సువార్త, నందిగం గంగారావు, నందిగం కోటి రత్నం, నందిగం దేశమ్మ, నందిగం దయమ్మ, కొమ్మవరపు రోషమ్మ, కొమ్మవరపు నాగయ్య, నందిగం ప్రవీణ్, బయ్యవరం నాగయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో కోనూరు మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, మచ్చా శ్రీనివాసరావు, పసుపులేటి జనార్ధన్, ఎంపీటీసీ సభ్యుడు యంగ్రపల్లి నటరాజు, గ్రామ పార్టీ కన్వీనర్ పాగిళ్ల శ్రీనివాసరావు తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం



సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్న స్థితి నుంచి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.రమణమూర్తి విద్యార్థులకు సూచించారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యాంశాలపై ఫోటో ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు తమకు ఇష్టమైన మతాన్ని, ఆచారాలను అనుసరించడానికి రాజ్యాంగం హక్కులు, అవకాశాలు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు టీవీ బహూకరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు అవసరమైన టీవీని వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో 16 సీసీ కెమెరాలు ఉండేవని, ప్రస్తుతం వాటిని 50 సీసీ కెమెరాలకు పెంచడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలను వీక్షించేందుకు ఓ పెద్దపాటి టీవీ అవసరం కాగా స్పందించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ టీవీని సమకూర్చారన్నారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ వైద్యశాలలో ఒకప్పుడు పర్యవేక్షణ లోపం ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతి వార్డుకి సీసీ కెమెరా అమర్చడం వల్లన ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా సీసీ కెమెరాలో నిక్షిప్తం అవుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, ఏవో గంగాభవాని, తదితరులు ఉన్నారు.

29 నుంచి విద్యుత్‌శాఖపై ప్రజాభిప్రాయ సేకరణ

నరసరావుపేట: స్థానిక బరంపేటలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 29, 30, 31 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నట్లు ఏఈ ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు.వినియోగదారుల అభిప్రాయాలను సేకరిస్తామని ఆయన తెలిపారు.

నవ సమాజ నిర్మాణానికి ఓటు తొలిమెట్టు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



నకరికల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

- ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి
- సత్తెనపల్లిలో ఘనంగా ఓటరు దినోత్సవం
- పురవీధుల్లో ర్యాలీలు, ప్రతిజ్ఞలు
- సీనియర్ ఓటర్లకు సత్కారం

సత్తెనపల్లి: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని సత్తెనపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విద్యాకేంద్రం డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన స్వీప్-2024 అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల నాయకులను ఓటు ద్వారానే ఎన్నుకోవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ జనవరి 25న ఏర్పడటంతో ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు బలమైన ఆయుధమని, ఆ దిశగా ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నంతగా ఓటరు చైతన్యం పట్టణాల్లో లేదని అన్నారు. యువత, విద్యావంతులు ఓటు నమోదులో కచ్చితంగా పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ఓటు వినియోగించుకోవడం అంటే మనం జీవించి ఉన్నట్టుగా ఆయన ఉదాహరించారు. తహసీల్దార్ ఎస్.సురేష్ మాట్లాడుతూ ఓటు పౌరుడి ప్రథమ హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని సీనియర్ సిటిజన్‌లు మాచర్ల పున్నారావు, వై.యాకోబు, ఆర్.పురుషోత్తం,గంగూరి కోటేశ్వరరావు, పీ.రామకోటయ్య, పీ.ఆంజనేయులు, కె.చెన్నయ్య, ఏ.తిరుపతయ్య, జి.చిన్నరాజు, వై.లక్ష్మమ్మ, బి.వెంకటయ్యలను సత్కరించారు. ముందుగా ర్యాలీ చేపట్టి సెమినార్ నిర్వహించారు. మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకట్రావు, ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు, విద్యార్థులు, యువకులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో ఉజ్వల భవిత

నకరికల్లు: ఓటు ఎంతో విలువైనది, శక్తి వంతమైనదని తహసీల్దార్ కె.నగేష్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నకరికల్లులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా కొనసాగి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరింది. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ ఓటుతో దేశాన్ని పాలించే సమర్థులైన నాయకులను ఎన్నుకునే శక్తి ఓటరుకు ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నూనె ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి భావన్నారాయణ, వీఆర్వోలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యం

ముప్పాళ్ళ: ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యమైనదని, ఓటు హక్కు సక్రమ వినియోగం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పెంచవచ్చని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవానీశంకర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, ఓటర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. నార్నెపాడు గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ పొన్నం కోటయ్యను తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముప్పాళ్ళ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో పీ.పుట్టారెడ్డి, ఎంఈఓ-2 సీతారామిరెడ్డి, ఏఓ అరుణ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ కె.సాయిజగన్నాథరావు, ఏఎస్ఐ నవరాజ్, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఆయా గ్రామాల బీఎల్ఓ లు పాల్గొన్నారు.

ఓటు హక్కును పొందడం జన్మహక్కు

పెదకూరపాడు: అర్హులైన పౌరులంతా విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి డి.నాగజ్యోతి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది జనవరి 25న ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటు తెలిపారు. ఈ క్రమంలో 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సీనియర్ ఓటర్లను సన్మానించటంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ జియా ఉల్‌హక్, ఎంఈవో ఏకుల ప్రసాద రావు, రెవిన్యూ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఆర్ బకాయిలను విడుదల చేయాలి

సత్తెనపల్లి: పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి తాలూకా అధ్యక్షుడు బొడ్డు రామారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి తాలూకా పరిధిలోని పెన్షనర్స్ అంతా గురువారం పెన్షనర్స్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. బొడ్డు రామారావు మాట్లాడుతూ అడిషనల్ క్వాంటమ్ పూర్వం మాదిరిగా ఇవ్వాలన్నారు. 11వ పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన వైద్యశాలల్లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ రొంపిచర్ల పురుషోత్తం, జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ నాయకులు కోటగిరి పోతులూరయ్య, కేబీఆర్‌జే ప్రసాద్, మురహరి రావు, రామకోటయ్య, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

శావల్యాపురం: మండల పరిధిలోని మతుకుమల్లి గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని చింతలబీడు బీసీ కాలనీకి చెందిన సీహెచ్ జ్యోతి ప్రసన్న (38) బుధవారం సాయంత్రం చీరతో ఫ్యానుకు ఉరేసు కుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉద యం సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, సీడీపీవో ముదివర్తి అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పంచాయతీ కార్యదర్శి సూరిబాబు నివాళి అర్పించారు. వ్యక్తిగత కారణాల వల్లే జ్యోతి ప్రసన్న ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారులు వెల్లడించారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన నకరికల్లు, రాజుపాలెం జట్లు



విజేతగా నిలిచిన నకరికల్లు పురుషుల జట్టు



జిల్లా పోటీలకు ఎంపికైన రాజుపాలెం మహిళా జట్టు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నియోజక వర్గస్థాయి ఆటల పోటీలు రెండో రోజు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులంతా ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలను ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డిలు ప్రారంభించారు. పట్టణంలోని ప్రగతి పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఖోఖో స్త్రీ, పురుష క్రీడా పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులకు ప్రతిభ ఉండి సరైన ప్రోత్సాహం లేక క్రీడా వేదికల్లో పాల్గొనలేక పోతుంటారన్నారు. అలాంటి క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలనే దృక్పథంతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో రెండో రోజు పట్టణంలోని ప్రగతి పాఠశాల క్రీడా మైదానంలో ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పురుషులు, మహిళా క్రీడాకారులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానం నకరికల్లు, ద్వితీయ స్థానం సత్తెనపల్లి, తృతీయ స్థానం రాజుపాలెం జట్లు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో ప్రథమ స్థానం రాజుపాలెం, ద్వితీయ స్థానం ముప్పాళ్ళ, తృతీయ స్థానం నకరికల్లు కైవసం చేసుకున్నాయి. మహిళలు, పురుషుల విభాగాల్లో మొదటి స్థానంలో గెలుపొందిన నకరికల్లు, రాజుపాలెం జట్లు జిల్లా స్థాయి పోటీల్లో తలపడతాయని మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్లను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీలు, నోడల్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు

నియోజకవర్గ స్థాయిలో శనివారం జరగబోయే క్రికెట్ పోటీలు శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలోనూ, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రగతి పాఠశాల క్రీడా మైదానంలోనూ జరుగుతాయని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ మూడు పోటీలు ఒకే రోజు నిర్వహించడం జరుగుతుందని, క్రీడాకారులు నిర్ణీత సమయానికి ఆయా మైదానాల్లో ఉండాలన్నారు.

అచ్చంపేట: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలులో రెండు రోజులుగా జరుగుతున్న పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ముగిశాయి. క్రికెట్, ఖోఖో పోటీలు 27, 29 తేదీలలో క్రోసూరు జెడ్పీ హైస్కూలులో జరుగుతాయని హైస్కూల్ పీడీ అలపాటి సుజాత తెలిపారు. పురుషుల, మహిళల కబడ్డీ పోటీలలో అచ్చంపేట జట్టు విన్నర్స్‌గానూ, పెదకూరపాడు రన్నర్స్‌గా నిలిచాయి. పురుషుల వాలీబాల్ పోటీలో విన్నర్స్‌గా అచ్చంపేట, రన్నర్స్‌గా బెల్లంకొండ జట్లు విజయం సాధించాయి. షెటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో విన్నర్స్‌గా అచ్చంపేట, రన్నర్స్‌గా అమరావతి మండలాలు గెలుపొందాయి. మహిళల విభాగంలో విన్నర్స్‌గా అమరావతి, రన్నర్స్‌గా క్రోసూరు మండలాలు కైవసం చేసుకున్నాయి.

చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అచ్చంపేటలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- తరలివచ్చిన డ్వాక్రా మహిళలు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శంకరరావు, డ్వాక్రా మహిళలు

అచ్చంపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ డ్వాక్రా మహిళలకు రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో బుధవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో నాలుగో విడుతగా 970 గ్రూపులకు రూ.6.71 కోట్ల రుణాలు చెల్లించడం జరిగిందన్నారు. నాలుగు విడతలలో రూ.25 కోట్లు మాఫీ జరిగిందన్నారు. గత నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం మరే ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. మాదిపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. మరో ఆరునెలల్లో అమరావతి నుంచి బెల్లంకొండ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పులిచింతల బ్యాక్ వాటరు నుంచి అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండలాలకు సాగునీటిని ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తనకు మరొక అవకాశం ఇస్తే పెదకూరపాడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. అనంతరం డ్వాక్రా రుణమాఫీ నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సభకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, సర్పంచ్ కంబాల వీరబాబు, ఎంపీడీవో స్వరూపారాణి, వెలుగు ఏపీయం షేక్ సలీం, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సాతర్ల శ్రీనివాసరావు, టౌన్‌పార్టీ కన్వీనర్ సమరం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- రూ.55 లక్షలతో పీహెచ్‌సీ అదనపు గది ప్రారంభం
- బయ్యవరంలో గ్రామ సచివాలయం, రహదారులు ప్రారంభం



ఆసుపత్రిలో సమస్యలను వైద్యుల ద్వారా తెలుసుకుంటున్న శంకరరావు

క్రోసూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులో నాడు-నేడు నిధులు రూ.55 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం ఎంతో మంది పేదలకు మేలు చేసిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.25 కోట్లతో ఆస్పత్రులను అభివృద్ధి చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందించే మహాయజ్ఞం చేస్తున్నామన్నారు.

ఆసుపత్రి ప్రస్తుత అవసరాల దృష్ట్యా విస్తరించాల్సిన అవసరం ఉందని పలు సౌకర్యాల అవసరాల గురించి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రిని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి ప్రత్యేక వైద్యులను ఏర్పాటు చేస్తే ఇక్కడే ఆపరేషన్లకు వీలుపడుతుందని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ డీఎస్ అనూరాధ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు , గల్లా గురుపాదం పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం, సీసీ రహదారి ప్రారంభం

క్రోసూరు: ప్రభుత్వాన్ని పల్లెసీమలకు తీసుకువచ్చి గడప వద్దకే సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు మండలం బయ్యవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో లక్షలాది ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి దేనన్నారు. పేదల కోసం పెత్తందార్లతో యుద్ధం చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రోసూరు మండల నాయకులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు పరిశీలన

క్రోసూరు: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అమరావతి – బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం క్రోసూరు వద్ద తుది దశకు చేరుకున్న పనులను పరిశీలించారు. పనులను నాణ్యత పరంగా ఎక్కడా లోపం లేకుండా పూర్తిచేయాలని అక్కడి అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.

నేడు మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో జరుగుతుందని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం పట్టణ అధ్యక్షుడు శింగరి మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. విగ్రహావిష్కరణను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభిస్తారన్నారు. సభాధ్యక్షులుగా మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి వ్యవహరిస్తారన్నారు. విగ్రహావిష్కరణకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ శాసనసభ్యుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ శాసనసభ్యుడు మద్దాలి గిరిధర్, ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుబ్బా చంద్రశేఖరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిశెట్టి మురళి మోహన్, పక్కాల సూరిబాబు, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ గీతహాసంతి, ఏపీ గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కపిలవాయి విజయ కుమార్, స్థానిక నాయకులు హాజరవుతారన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు బ్రాండ్ అంబాసిడర్స్‌గా అచ్చంపేట క్రీడాకారులు



అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గానికి ఆడుదాం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్స్‌గా అచ్చంపేటకు చెందిన ఇరువురు జాతీయ క్రీడాకారులను పల్నాడు జిల్లా స్పోర్ట్స్ అథారిటి ఎంపిక చేసింది. వీరిని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభినందించి సన్మానించారు. ఎంపికైన ఇరువురిలో పోలిశెట్టి నరేంద్ర ఆల్ ఇండియా లెవెల్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో ఆడేందుకు ఎంపికయ్యాడు. పెదపాలెం గ్రామానికి చెందిన నూనావతు సత్యనారాయణ నాయక్ ఆల్ ఇండియా లెవెల్ రెజ్లింగ్, కబడ్డీ పోటీలలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారనడానికి వీరే నిదర్శనమన్నారు. నియోజకవర్గంలోని క్రీడాకారులందరికీ వీరిరువురు ఆదర్శంగా నిలిచేందుకు స్పోర్ట్స్ అథారిటీ వీరిని బ్రాండ్ అంబాసిడర్స్‌గా ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనికృష్ణా నాయక్, ఎంపీడీవో స్వరూపారాణి, ఇరువురు క్రీడాకారులకు తర్ఫీదు నిచ్చిన హైస్కూలు పీడీ అలపాటి సుజాత తదితరులున్నారు.